


# పోష్టుచేయని ప్రేమలేఖ

'రాధిక'

ప్రియమైన సుగుణవల్లీ

చాలాకాలం ఆలోచించిన తర్వాతే వుత్తరం వ్రాస్తున్నాను. పూర్తిగా చదివిన తర్వాతే ఏ నిర్ణయానికైనా రా. ఉత్తరంలో నా మనస్సు అంతా విప్పి రాస్తున్నాను.

వల్లీ! నిన్ను మొదటిసారిగా ఎక్కడ ఏ సందర్భంలో చూశానో నాకు గుర్తులేదు కాని, అవి నా పాలిట అమృత ఘడియలే నని నిస్సంకోచంగా చెప్పగలను. ఎందుకంటె నిన్ను చూడకముందూ, చూశాక నాకు జీవితంలో చాలా అందమైన అమ్మాయిలు తటస్థపడ్డారు. కాని నన్ను నిజాపునా ఆకట్టుకున్నదానివీ, ఆకర్షించుకున్నదానివీ నువ్వేనూ నా హృదయంలో నీ రూపం చెరగకుండా పీఠం వేసుకుని కూర్చుంది.

నీకు మన స్కూలుడేస్ గుర్తున్నాయా? ప్రేమంటే తెలియని ఆ వయస్సులోనే నువ్వంటే నాకెంతో ఇష్టంగా ఉండేది వీలు చిక్కినప్పుడెల్లా నీతో మాట్లాడాలని నా మనస్సు ఉవ్విళ్ళూరేది. అందుకనే స్కూలు వార్షికోత్సవాల వంకతో మీ ఇంటికి వస్తూండేవాణ్ణి. మరోసంగతి నీకు జ్ఞాపకం ఉండే ఉండాలి నువ్వు మన లెక్కల మాష్టారి దగ్గర ప్రైవేటు చెప్పించుకునే దానివి. నీతో నా పరిచయం పెంచుకోడానికి అది మంచి అవకాశంగా కన్పించి. నేనూ ఇష్టంలేకపోయినా మాష్టారి దగ్గరకు ట్యూషన్‌కి వచ్చేవాణ్ణి. నా భ్రమేనో, మరేమిటోగాని నువ్వుకూడా బాగానే మాట్లాడేదానివి. నీ మాటల్లో కనపడిన ఉత్సాహమే నీమీద నాకున్న ఇష్టాన్ని మరింతగా పెంచింది.

పెరిగేవయసు ఆ ఇష్టాన్ని ప్రేమగామార్చింది. అప్పుడనుకుంటూండేవాణ్ణి-మనంచప్పున హైస్కూలు వదిలి కాలేజీకి వస్తే బాగుండునని కారణం ఏమిటంటే ఆ స్థాయికివస్తే కోరికలు వెల్లడించుకోటానికి ఒక అర్హత వస్తుందని నా ఆశ. కాని నేననుకున్నట్లు జరగలేదు నీలో విచిత్రమైన మార్పొకటి వచ్చింది. కాలేజీలోచేరాక నీతో రెండు మూడుసార్లు మాట్లాడ్డానికి ప్రయత్నించాను. ఒక మాటు పలుకరించడానికి ప్రయత్నించినా చూడనట్లుగా తప్పించుకుపోయావ్. మరోసారిమాట్లాడిన రెండుక్షణాలు అటూ ఇటూ బిత్తర చూపులు చూస్తూ పొడిపొడిగా మాట్లాడావు. నీ ప్రవర్తనకి సరైన కారణం నాకు తోచలేదు చివరకి అలాంటి అయోమయ స్థితిలో విశ్వగాడే శరణ్యమయ్యాడు. వాడొక రచయిత కనుక నీ ప్రవర్తనకి సరైన అర్థం విడమర్చి చెప్తాడని ఆశ నా గొడంతా విన్న వాడు పెళ్ళున నవ్వి భుజం చరిచి 'ఈ మాత్రానికి అర్థం తెలియకపోతే నీకు ప్రేమేమిట్రా?" అంటూ నవ్వాడు.

నేనేం సమాధానం చెప్పకపోవటంతో వాడికి జాలే వేసిందో ఏమిటో కాని మెల్లిగా 'సిగ్గురా! అందుకే మాట్లాడలేకపోతోంది. పైగా ఆడపిల్లలకు ఈ వయసులో అది అందమైన ఆభరణం కూడానూ...' తర్వాత ఇంకా సిగ్గుమీద-వయసు మీదా కూడా పెద్ద ఉపన్యాసమే దంచాడు కాని నాకు వినబుద్ధవ్వలేదు.

పాడు వయసూ-పాడుసిగ్గూ అని మనసులోనే తిట్టుకున్నాను. ఏ అడ్డంకులూ లేని చిన్నతనమే నయమనిపించింది మళ్ళీ ఆ రోజులు ఒకసారి వస్తే? ఎంత తెలివితక్కువ మళ్ళీ రాని వాటి మీదేగా మోజులుండటం

రాను రాను నాలో పరాకు ఎక్కువైంది ఏది చేస్తున్నా-ఎక్కడ ఉన్నా నీ ధ్యానే నీ గురించి తపనే. ఇంచుమించు పిచ్చివాడిలా తయారయ్యాను. నీ తాలుకు ఆలోచనల్తో, నా స్థితి చూసి విశ్వగాడన్నాడు 'పోనీ నువ్వే ఒకమాటు ఆ అమ్మాయికి నీ ప్రేమను వెల్లడించుకో కూడదూ?'

అదీ రైటే ననిపించింది. అవకాశం కోసం చూడటం మొదలెట్టాను. తీరా ఒకటి రెండుసార్లు వచ్చినా మనసులో మాట ఎలా చెప్పాలా అని ఆలోచించేసరికే నువ్వు వెళ్ళిపోయేదానివి ఇలా ఎప్పుడైతే జరిగిందో నాలో తెగింపు అణుమాత్రం కూడా లేకపోయినందుకు నన్ను నేను నిందించుకున్నాను.

ఇదంతా తెలుసున్న ఒక భ్రష్టుడేమన్నాడో తెలుసా వల్లీ?. ఏమిటోయ్. మరీ పిచ్చివాడివై పోతున్నావ్? అయినా ఆ అమ్మాయి ఏమంత అందంగా ఉంటుందనీ? నా మాటవిని మరో అమ్మాయి గురించి ట్రైచేయి విష్‌యూ గుడ్‌లక్' అంటూ వెకిలిగా నవ్వుతూ వెళ్ళిపోయాడు. నాకు వళ్ళు మండుకొచ్చింది ఆ దుర్మారుడి మాటలు వింటే. ప్రేమను మరీ అంత తేలిగ్గా తీసిపారేసిన వాణ్ణి షూట్ చేసేయాలన్నంత కోపం వచ్చింది అందమైన అమ్మాయినీ — ఆమెతోబాటు ఆస్తినీ చూసుకుని మరీ ప్రేమించాలి కాబోలు ప్రేమించే ముందు. అయినా వాడికేం తెలుసూ అందరికీ కనిపించని - నా కొక్కడికే కనిపించే అందమైన అందం నీ కళ్ళల్లో ఉందని.

ఈ ప్రేమకథ తెలిశాక నా స్నేహితుల్లోనూ - సన్నిహితుల్లోనూకూడా నా మీద ప్రత్యక్షంగానూ - పరోక్షంగానూ విమర్శలు తలెత్తాయి. ప్రేమంటే కథల్లోలాగా సినిమాల్లోకి మల్లేనూ ఉంటుందను కున్నాడు కాబోలని మరి కొంతమంది వ్యాఖ్యానించటంకూడా నాకు తెల్సు. వాళ్ళు చాలా తెలివి తక్కువ వాళ్ళుగా కనిపించారు నాకు. ఆ కథలకైనా సినిమాలకైనా ఇలాంటి సంఘటనలేగా ఆధారం? ఏమైనా నా చుట్టూ రొదపెడ్తున్న ఈ కాకుల్ని లెక్కచేయదల్చుకోలేదు.

ఇంతకీ ఈ ఉత్తరం ఎందుకు రాస్తున్నానో అర్థం అయ్యిందా? ఎంత ప్రయత్నించినా ఎదుట పడేసరికి నా ప్రేమను నీకు వెల్లడించుకోలేక పోతున్నాను. ఉత్తరంలో అయితే చెప్పదల్చుకున్నదంతా వివరంగా చెప్పొచ్చు. పైగా ఏ మాత్రం సంకోచించక్కర్లేదు. ఎన్నాళ్ళైనా నీ సమాధానం కోసం కనిపెట్టుకుని ఉంటాను. నిన్ను నేను నిండుగా ప్రేమిస్తున్నాను. నీ ప్రేమ నాకు కావాలి నువ్వు నా దానివి అవ్వాలి. అదే నా కోరిక. అంతకన్నా ఈ జీవితానికి పెద్ద కోరికలు ఏమీ

లేవు. ఈ ఒక్క ఆశే నా బ్రతుకునుపండించాలి.

వల్లీ నా హృదయాన్ని నీకు విప్పి చెప్పాను. నా ప్రేమను అంగీకరిస్తావో లేక తిరస్కరిస్తావో మరి. నిన్ను నేను పువ్వుల్లో పెట్టి పూజించలేక పోవచ్చు కాని పువ్వులా మాత్రం పదిలంగా చూసుకుంటాను

ఒకవేళ దురదృష్టవశాత్తు నీ చేత ప్రేమించ బడని పక్షంలో మరో జన్మలోనైనా నీ వాడిని కావాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను

ఉంటాను,

— భాస్కర్.

ఉత్తరం చదవటం ముగించిన వల్లి ఆలోచన్లో పడింది. ఇది కలో నిజమో అర్థంకాలేదు కొంతసేపటివరకూ ఆమెకు. ఉత్తరాన్ని మళ్ళీ ఒకసారి చదివింది. మళ్ళీ మళ్ళీ... ఆమె హృదయంలో ఆనందం కట్టలు తెంచుకుంది.

కళ్లు సంతోషంతో చెమ్మగిల్లాయి. ఆ సంతోషం ఆమెని ఒకచోట నిలవనీయకుండా చేస్తోంది ఎంత మంచిరోజు ఈరోజు భాస్కర్ పుస్తకాల బీరువా చిందరవందరగా ఉంటే సర్దుదామని తీసిందితను. ఒక పుస్తకంలోంచి పడింది ఉత్తరం. యదాలాపంగా తీసిచూసింది. లేకపోతే ఈ కమ్మటి కబురు తనకి తెలిసేదేకాదు ఉత్తరాన్ని హృదయానికి హత్తుకుని గోడకున్న భాస్కర్ ఫొటో దగ్గరకు వెళ్ళింది. ఒకమాటు చుట్టూచూసి మునివేళ్ళమీద నిలబడి అతని ఫొటోని ముద్దుపెట్టుకుంది.

ఇంతలోకి ఉయ్యాల్లో నానిగాడు కదిలాడు. చప్పున పరిగెత్తుకుని వచ్చి వాణ్ని ఎత్తుకుని. "ఒరేయ్ నానీ మీ నాన్న నన్ను ప్రేమించారుట్రోయ్." అంది రహస్యంగా.

వాడు నవ్వాడు. 'ఛీ వెధవా. అక్కడికి అర్థం అయినట్లు బోసినవ్వులూ నువ్వూనూ" అంటూ వాడి బుగ్గమీద ముద్దుపెట్టి తిరిగి ఉయ్యాల్లో పడుకోబెట్టింది.

గడియారంకేసి చూసింది వల్లి. నాలుగున్నర అయింది. అయితే భాస్కర్ వచ్చేస్తాడు. ఉత్తరం సంగతి అడగాలి ఎలా అడగాలబ్బా? 'చెక్కిట చేయిచేర్చి ఆలోచిస్తూ ఉండిపోయింది అలా ఎంతసేపో ఉండిపోయి వీధిలో స్కూటర్ ఆగిన శబ్దానికి లేచింది. హాల్లోకి వస్తున్న భాస్కర్‌ని చూడగానే వల్లి హృదయంలో ప్రేమ పెల్లుబికింది. ఆమె కళ్ళల్లో కొత్తమెరుపు కనిపెట్టాడో ఏమిటో కాని. 'ఏం వల్లీ ఈ రోజేదో చాలా ఆనందంగా ఉన్నట్లున్నావ్? కారణం చెప్తావా దేవీ?" అంటూ దగ్గరకొచ్చాడు.

'మీరే" అని చెప్పాలనుకుంది, కాని అతిశయించిన ఆనందం ఆమెని మూగదాన్ని చేసింది. అలాగేవెళ్ళి అతని హృదయంమీద వాలిపోయింది. చిత్రంగా చూశాడు భాస్కర్.

'వల్లీ " మెల్లగా పిలిచాడు భాస్కర్.

'ఊఁ ' బరువుగా బదులుపలికింది.

'ఒకమాటు వెనక్కి తిరిగి నుంచుంటావా?'

అది రోజూ మామూలే అతనలా అంటాడు,


ప్రగతి
సచిత్రవారపత్రిక

## ప్రకటన రేట్లు

| | |
|---|---|
| కాజుయల్ కాలం సెం. మీ. | రు. 4-50 |
| కాంట్రాక్టు ,, ,, | 3-50 |

[ఒక సంవత్సరానికి 250 సెం. మీ. మరియు ఆపైన]
కనీసం 5 సెం. మీ × సింగిల్ కాలం

## రేపర్స్ : బ్యాక్ కవర్

| | | ఒకసారి వేయడానికి |
|---|---|---|
| ఒక రంగులో | కాజుయల్ | ,, రు. 375/- |
| | కాంట్రాక్టు | ,, రు. 325/- |
| రెండు రంగులలో | కాజుయల్ | ,, రు. 425/- |
| | కాంట్రాక్టు | ,, రు. 375/- |
| మూడు రంగులలో | కాజుయల్ | ,, రు. 475/- |
| | కాంట్రాక్టు | ,, రు. 425/- |

## రెండవ మరియు మూడవ రేపర్ ఒక రంగు

| | | |
|---|---|---|
| కాజుయల్ | ఒకసారికి | రు. 350/- |
| కాంట్రాక్టు | ,, | రు 300/- |

## లోపలి పేజీలు

| | | |
|---|---|---|
| కాజుయల్ | ఒకసారికి | రు. 300/- |
| కాంట్రాక్టు | ,, | రు. 240/- |

మీ వ్యాపారాభివృద్ధికి ప్రగతి సచిత్రవార పత్రికను ఉపయోగించుకొన గోర్తాము.

## చందా రేట్లు

| | పోస్టుద్వారా | ఏజెంటుద్వారా |
|---|---|---|
| 3 మాసాలకు | రు. 5-20 | రు. 4-50 |
| 6 మాసాలకు | రు. 10-40 | రు. 9-00 |
| సంవత్సరానికి | రు. 20-80 | రు. 18-60 |

## ప్రగతి సచిత్ర వారపత్రిక

విశాలాంధ్ర బిల్డింగ్స్

మాచవరం : : విజయవాడ-4.

తను నుంచుంటుంది జేబులోంచి పూలచెండుతీసి జడలో పెట్టాడు.

పూలు పెట్టించుకున్నాక జ్ఞాపకం వచ్చింది. అతనికింకా కాఫీయైన ఇవ్వలేదని. ఉండండి ఇప్పుడే వస్తానంటూ వంటింట్లోకి నడిచింది. కాసేపటిలో ట్రేలో కాఫీ కప్పు, మంచినీళ్ళగ్లాసుతో ప్రవేశించింది.

మంచినీళ్ళు త్రాగి కాఫీకప్పు నోటిదగ్గర పెట్టుకోబోతూ ఏదో జ్ఞాపకం వచ్చిన వాడిలా ఆగి "ఫిఫ్టీ ఫిఫ్టీ" అన్నాడు వల్లికేసి చూస్తూ.

'ఊహు వద్దుబాబూ'

కప్పు టీపాయ్‌మీద పెట్టి పేపరందుకుని అలక నటించటం మొదలెట్టాడు. రెండు నిముషాలు అలాగే అతని మొహంలోకి చూసి ఆ పట్టుదలకి నవ్వుకుని లోపలకి వెళ్ళి ఖాళీకప్పు తీసుకొచ్చి కొంచెం కాఫీ అందులో పోసుకుంది.

'అలకమానండి మరి' అతని చేతిలో పేపరు తీసి టీపాయ్‌మీద పెడ్తూ అంది.

'గుడ్ అదీ మంచిమ్మాయిల లక్షణం.' కప్పు అందుకున్నాడు

ఉత్తరం సంగతి ఏమని మొదలెట్టాలో తోచ లేదు వల్లికి. చివరకి కాస్త సర్దుకుని, 'నేనొకటి అడగనా?' అంది.

భాస్కర్ ఖాళీకప్పు టీపాయ్‌మీద పెడ్తూ 'వద్దు ముందర నేనొకటి చెప్తాను విను విని కోపం తెచ్చుకోకేం?'

చెప్పమన్నట్లు తలూపింది.

'ఇవాళ ఆఫీసులో ఏం జరిగిందో తెలుసా వల్లీ మా స్టెనో లేదూ? రూమ్‌లో కొచ్చి అదో మాదిరిగా వగలుపోతూ 'బాస్ ఈరోజు సినిమాకి వెళ్దామా?' అంది, నాకు భలే కోపం వచ్చిందిలే. అంతే నాలుగు చివాట్లు పెట్టేశాను. దేవతలాంటి దానివి నువ్వుండగా దానితో సినిమాకి రావాలిట నేను రాస్కెల్."

ఉక్కిరి బిక్కిరి అయిపోయింది వల్లి. వద్దు. వద్దు నన్ను దేవతని చేయకండి నేను మీ భార్యని మీదాన్ని అంతే ...అదిచాలు నాకు. అయినా ఇంత ప్రేమ నేను భరించలేను. ఇప్పటికే ఆనందం గుండె నిండుగా ఉంది. ఇంకా ఎక్కువైతే ఏమౌతానో? భాస్కర్ నేను చాలా అదృష్ట వంతురాల్ని జన్మజన్మలకు ఈ అదృష్టమేకావాలి నాకు మనసులోనే పొంగిపోయింది వల్లి.

వల్లి కళ్ళు ఆనందంలో చెమర్చాయి ఆమె కళ్ళల్లో నీళ్ళు చూసి భాస్కర్ కంగారుపడ్డాడు: 'ఏమిటి వల్లీ ఎందుకా కన్నీళ్ళు? ఛ ఇప్పు డేమయ్యిందనీ? నాకు తెల్సు నీది చాలా డెలికేట్ హార్టని. అందుకే చెప్పడానికి సంశయించాను."

వల్లి కళ్ళు తుడుచుకుంటూ పెదాలపైకి చిరు నవ్వు తెచ్చుకుంటూ అంది, 'లేదు! లేదు ..ఈ సంఘటన చెప్పి మీరు నా హృదయంలో మరింత ఉన్నత స్థానం సంపాదించుకున్నారు ఇది ఏడుపు కాదు ఆనందం' అలాగే అతని చేతుల్లో ఇమిడి పోయింది.

క్షణం తర్వాత తలెత్తి 'నేనొకటి అడుగుతాను నిజం చెప్తారా?' అంది.

"ఏమిటది?" భాస్కర్ ప్రశ్నార్థకంగాచూశాడు.

'ఆ ఉత్తరం సంగతి ఎప్పుడూ నాకు చెప్ప లేదేం?"

'ఏ ఉత్తరం సంగతి?'

జ్ఞాపకం తెచ్చుకోండి'

భాస్కర్ ఆలోచనల్లో పడ్డాడు. బాగా చీకటి పడటంవల్ల-వల్లి వంటప్రయత్నం కోసం లేచింది. వంట చేస్తోన్నంతసేపు అదే ఆలోచన ఏమని సమాధానం చెప్తాడో? ఉత్తరంరాసికూడా పోస్టుచేనేం దుకు ఎందుకు అనుమానించాడో? వల్లీ. నువ్వు నాకు కావా లని అడిగితే కాదనేదా తను? అసలు ఆడదానికి అంతకన్నా అదృష్టం మరేముంటుంది? నా జీవిత భాగస్వామినిగా రా అని మగవాడు తనంతట తానై అడిగితే ఆడదానికి ఎంతగౌరవం? రాజ్యాలు అక్కర్లేదు-భోగాలు అక్కర్లేదు.నిండుగా మగవాడు ప్రేమిస్తే చాలు ఎరవశిస్తుంది స్త్రీ. అదే ఆమె పాలిట స్వర్గం

వంట ముగించి సావిట్లో కొచ్చిన వల్లి భాస్కర్ కేసి చూసి అమ్మో' అనుకుంది. అప్పటికే చాలా సిగరెట్టు ముక్కలు క్రింద పడున్నాయి. మరో సిగరెట్టు వెలిగిస్తూ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. గబగబావచ్చి భాస్కర్ నోట్లో సిగరెట్టుతీసి క్రిందపడేసింది.

'చిన్నవిషయం జ్ఞాపకం చేసుకోడానికి టిన్నులు

ooooooooooooooooooooooooooo

"మనమిద్దరంపెళ్ళిచేసుకుంటే ఉద్యోగం కాస్తా పోతుంది."

"పెళ్ళినే రహస్యంగా వుంచుదాం"

"పిల్లవాడు పుడితే అదికాస్తా బయట పడిపోతుందే?"

"వాడితోగూడా చెబుదాం యిదిరహస్యం ఎక్కడా అనకురా" అనీ -

ooooooooooooooooooooooooooo

టిన్నులు సిగరెట్లు కాల్చక్కర్లేదు. భాస్కర్" ప్రక్కన కూర్చుంటూ అంది వల్లి.

'నువ్వేగా ఏదో ఆలోచించమన్నావ్?" ఆమా యకంగా చూస్తూ అన్నాడు

"అవును ఆలోచించ మన్నాను ... అంతేగా సిగరెట్టు కాల్చమన్లేదే మరి"

సిగరెట్లు కాల్చనిదే ఆలోచన్లు రావుగా!'

'అబ్బ వట్టి మొండిబాబూ అవకాశంవస్తే చాలు సిగరెట్లు కాల్చాలనే దృష్టి అబ్బాయిగార్కి. ఇదిగో ఈ మాటు కాలిస్తే నా మీద ఒ .....'

వల్లీ వల్లీ నా బంగారు తల్లివి కదూ? ఒట్టు పెట్టకేం సిగరెట్లు కాల్చకపోతే నాకు మతి పోతుంది నాకు మతిపోవటం నీ కిష్టమా చెప్పు మరి.'

'సరే వారానికొకటి కాల్చుకునేందుకు పర్మిషన్ ఇస్తున్నాను తెలిసిందా?'

ఊఁ తెలిసింది.'

'ఏమిటీ"

అదే వారానికొకటి కాల్చుకోవచ్చునని! ...

టిన్ను." అతని కొంటితనానికి నవ్వుకుంది వల్లి భాస్కర్‌కూడా నవ్వేశాడు.

'అవునుకాని వల్లీ ఏదో ఉత్తరం అన్నావ్ ఏమిటదీ?"

సమాధానంగా ఇందాక తను చదివిన ప్రేమలేఖ తెచ్చి ఇచ్చింది. ఉత్తరం తెరచిచూసి తిరిగి మడతపెడ్తూ, 'ఇదెక్కడ దొరికింది వల్లీ నీకు?'

వల్లి చెప్పింది రెండు క్షణాలాగి 'మీకు తెలియని నిజం ఒకటుంది చెప్పమంటారా?' అడిగింది భాస్కర్‌ని.

'నిజమా? ..ఏమిటది?"

'అసలు మీ ప్రేమసంగతే నాకు తెలియదు. ఎందుకోకాని నాకు మాత్రం చిన్నప్పట్నుంచి మీరంటేనూ-మీ మాటలంటేనూ చాలా ఇష్టంగా ఉండేది. ఆ ఇష్టాన్నే ప్రేమనికూడా అనవచ్చునను కోండి కాని వయసు వస్తున్నకొద్దీ పదిమందిలోనైనా సరే వంటరిగానైనా మీలో మాట్లాడాలంటే తెగ సిగ్గుగా ఉండేది. అందుకే మీరు కనిపించి నప్పుడల్లా తప్పుకు తిరిగేదాన్ని. అంతేకాని మరొకటేంకాదు .."

భాస్కర్ వింతగా వింటున్నాడు.

వల్లి చెప్పుకుపోసాగింది: "మాట్లాడ్డానికే సిగ్గు ముంచుకొస్తూంటేమనసులో కోర్కె ఎలాచెప్పగల్ను చెప్పండి? అందుకని నాలో నేనే మదన పడేదాన్ని మార్గంతోచక. సెకండ్‌యియర్ ఎగ్జామ్స్ ముంద రనుకుంటాను చదువుకుంటున్నాను నేను ప్రక్క గదిలో అమ్మా నాన్నగారూ మాట్లాడుకుంటున్నారు. ఎలాగైనా థర్డ్‌యియర్ అయ్యేసరికి నా పెళ్ళి చేసేయ్యాలని. ఆ మాట వింటూండగానే నాకు దిగులు పట్టుకుంది. అప్పుడే మీరు దూరం అయి పోతున్నట్లుగా భయపడ్డాను. అంతే. ఆ తర్వాత చదువు సరిగ్గా తలకెక్కేదికాదు. ఎప్పుడూ దిగాల్గా ఉండేది. ఆఖరికి ధైర్యంచేసి దాభిన్నయ్యకు చెప్పాను. అన్నయ్యకి కూడా నేనంటే అభిమానం ఎక్కువ. నా అభిప్రాయంగా కాకుండా తనకి తోచి నట్లుగానే చెప్పాడు నాన్నగార్కి మీ సంగతి. నాన్న గార్కి-అమ్మకి కూడా మీరంటే మంచి అభిప్రాయం ఉండటంచేత వెంటనే ఒప్పుకున్నారు. తర్వాత మీకు తెల్సున్నదే అమ్మవచ్చి అత్తయ్యని అడ గటం అదీ.

పోన్లెండి! ఏదిఏమైనా నేను చాలా అదృష్ట వంతురాల్ని. స్త్రీ ఎప్పుడూ తను ప్రేమించడంకన్నా ప్రేమించబడటమే ఎక్కువ వాంఛిస్తుందట. నాకు రెండూ దక్కాయి. అందుకే నేను చాలా అదృష్ట వంతురాల్ని"

భాస్కర్‌కిదంతా ఆశ్చర్యంగా ఉంది. వల్లిని దగ్గరగా తీసుకుంటూ, నువ్వేకాదు వల్లీ. నీతో బాటు నేను అదృష్టవంతుణ్ణే' అన్నాడు.

వల్లి తన్మయత్వంగా కళ్ళుమూసుకుంది.

ఉయ్యాల్లో నానిగాణ్ణి ఏ చీమోకుట్టింది కాబోలు కేరుమన్నాడు

★